సాక్షి విజయనగరం

సోమవారం । 12 । మే । 2025



నీలి కిరణాలతో అంధత్వం

ప్రస్తుత జీవన ప్రమాణాల్లో భాగంగా సెల్‌ఫోన్ నిత్యావసర వస్తువుగా మారిపోయింది. చిన్నా పెద్ద తేడా లేకుండా ఎవరి చేతిలో చూసినా ఫోన్ కనిపిస్తుంది. - 8లో



ఇంటర్‌లో కొత్తపాఠాలు

ఇంటర్మీడియట్ విద్యాబోధనలో నూతన సంస్కరణలను ప్రభుత్వం ఈ ఏడాది చేపడుతోంది. - 8లో



సాలూరులో కలకలం - 8లో

దశాబ్దంన్నర కాలం తరువాత సాలూరు పట్టణంలో జరగనున్న శ్యామలాంబ అమ్మవారి పండగ జాతర ఏర్పాట్లలో అంతా నిమగ్నమై ఉండగా పట్టణంలో ఒక్కసారిగా కలకలం రేగింది.

న్యూస్‌రీల్

14న ఏపీటీఎఫ్ రాష్ట్ర స్థాయి ధర్నా



మాట్లాడుతున్న రాష్ట్ర అకడెమిక్ కన్వీనర్ జేసీ రాజు

బొబ్బిలి: పాఠశాల విద్యలో అసంబద్ధ విధానాలను వెంటనే సరిచేయాలని కోరుతూ ఈ నెల 14న విజయవాడ ధర్నా చౌక్‌లో చేపడుతున్న రాష్ట్ర స్థాయి ధర్నాను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడెమిక్ కన్వీనర్ జేసీ రాజు పిలుపునిచ్చారు. ఏపీటీఎఫ్ స్థానిక కార్యాలయంలో సీహెచ్ ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రభుత్వానికి ప్రయోగశాలలుగా మారాయని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం అంచెల వారీ పాఠశాలలను నడిపితే ఈ ప్రభుత్వం పోటీగా 9 రకాల పాఠశాలల అమలుకు సన్నాహాలు చేస్తోందని విమర్శించారు. ఒక్కో పాఠశాలకూ ఒక్కో నిష్పత్తిలో ఉపాధ్యాయులు, విద్యార్థులుండాలనే షరతులున్నాయన్నారు. సమావేశంలో గౌరవాధ్యక్షుడు బంకురు జోగినాయుడు, రమేష్, నాగేశ్వరరావు, చిన్నారావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ నీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలి

పార్వతీపురం టౌన్: జిల్లాలో పెండింగ్ నీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీవో హోంలో రైతు సంఘం ఆధ్వర్యంలో పెండింగ్ నీటి ప్రాజెక్టులపై ఆదివారం జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నీటి ప్రాజెక్టులపై రైతుల ఎదుర్కొంటున్న సమస్యలను ఎత్తి చూపారు. ఈ ఏడాది బడ్జెట్లో కూడా జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణంలో ఉన్న జంఝావతి, అడారుగెడ్డ, కారిగెడ్డ, వనకబడి, పెద్దగెడ్డ ప్రాజెక్టులకు నిధులు నిల్‌గానే ఉన్నాయని దుయ్యబట్టారు. తోటపల్లి ప్రాజెక్టు పూర్తికి అధికారులు రూ.590 కోట్లు ప్రతిపాదించగా ఉద్యోగుల భత్యం కోసం రూ.47 కోట్లు విడుదల చేసిందని ఇది చాలా అన్యాయమని దుయ్యబట్టారు. జిల్లాకు జరుగుతున్న అన్యాయాన్ని పోరాడి తిప్పికొట్టాలని అందుకు తోటపల్లి, పెద్దగెడ్డ నిర్వాసితుల, రైతుల పోరాటాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అందులో భాగమే ముందుగా రైతులు సంతకాలు చేసి గ్రామ సచివాలయాల వద్ద మే 21 నుంచి 24 వరకు నిరసనలు తెలియజేసి వినతులు అందిస్తామని, అనంతరం ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. సదస్సులో రైతులు, వ్యవసాయ కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మీనాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాసు, కరణం రవీంద్ర, రైతులు పాల్గొన్నారు.

బియ్యం, పంచదారతో.. సరిపెట్టేశారు..!



బహిరంగ మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు భగ్గుమంటున్నాయి. వీటిలో కంది పప్పు ధర మరింత ఎక్కువగా ఉంది. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు వీటి కొనుగోలుకు దూరంగా ఉంటున్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం గడిచిన మూడు నెలలుగా రేషన్ సరుకుల్లో కంది పప్పుకు కోత పెట్టింది. బియ్యం, పంచదారతో సరిపెట్టేసింది. మూడు నెలలుగా కంది పప్పు రేషన్ ద్వారా అందుతుందని ఆశగా ఎదురు చూస్తున్న లబ్ధిదారులకు నిరాశే మిగులుతుంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయని కూటమి పాలకులపై లబ్ధిదారులు రుసరుసలాడుతున్నారు.



ఎండీఎం వాహనం వద్ద బియ్యం తీసుకుంటున్న మహిళలు

- మూడు నెలలుగా నిలిచిపోయిన కందిపప్పు సరఫరా
- ఎన్నికల వేళ గొప్పలు...తరువాత చుక్కలు
- జిల్లాలో 5,71,354 రైస్ కార్డులు
- నెలకు వీరికి అందించాల్సిన కందిపప్పు 571.354 మెట్రిక్ టన్నులు
- రూ.11.48 కోట్లు మిగుల్చుకున్న ప్రభుత్వం

విజయనగరం ఫోర్ట్:

ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే ప్రజలకు అన్ని రకాల రేషన్ సరుకులు సరఫరా చేస్తామని కూటమి సర్కార్ గొప్పలు చెప్పింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాటలకు దిక్కు లేకుండా పోయింది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేసే సరుకుల్లో కోత పెట్టి ప్రజలకు కూటమి సర్కార్ షాక్ ఇచ్చింది. దీంతో విస్తుపోవడం ప్రజల వంతు అయింది. గత కొద్ది నెలలుగా ప్రజలకు అందించాల్సిన కందిపప్పును కూటమి ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో ప్రజలు బహిరంగ మార్కెట్లో కందిపప్పు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. మార్కెట్లో కంది పప్పు ధర చూస్తే భగ్గుమంటోంది. దీన్ని కొనుగోలు చేయలేని స్థితిలో పేద, మధ్య తరగతి ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇది భారం అయినప్పటికీ తప్పని పరిస్థితి.

హామీల అమలు ఉత్తిదే..

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చింది. కానీ అవి అమలుకు నోచుకోవడం లేదు. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం పేరిట రూ.15 వేలు చొప్పున అందిస్తామని కూటమి నేతలు చెప్పారు. ఇంతవరకు అమలు చేసిన దాఖలాలు లేవు. రైతు భరోసా పథకాన్ని అన్నదాత సుఖీభవ పథకంగా మార్చి రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని గొప్పగా చెప్పారు. కానీ ఇంతవరకు ఒక్క పైసా ఇవ్వలేదు. మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేస్తామన్నారు. 11 నెలలైనా అమలు చేయలేదు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ మహిళకు రూ.1500 ఇస్తామని చెప్పారు. ఒక్క మహిళకు అమలు చేసిన పాపాన పోలేదు.

రేషన్ బియ్యం, పంచదారతో సరి

రైస్ కార్డులకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరుకులను పంపిణీ చేస్తుంది. అయితే కూటమి సర్కార్ గత మూడు నెలలుగా బియ్యం, పంచదార (అర కేజీ)తో సరిపెడుతుంది. కందిపప్పు పంపిణీ నిలిపివేసింది. దీంతో కార్డుదారులు బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు కందిపప్పు కొనుగోలు చేస్తున్నారు.

5,71,354 రైస్ కార్డులు

జిల్లాలో 5,71,354 రైస్‌కార్డులు ఉన్నాయి. వీరికి ఒక నెలకు 571.354 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరం. మార్చి నెల నుంచి కంది పప్పు సరఫరా నిలిచిపోయింది. దీని వల్ల ప్రభుత్వానికి రూ.11.48 కోట్ల వరకు భారం తగ్గింది. కోట్లాది రుపాయిల భారం తగ్గించుకోవాలనే ఉద్దేశంతోనే కూటమి సర్కార్ కందిపప్పు సరఫరా నిలిపివేసిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిత్యావసర ధరలు పెరిగిన నేపథ్యంలో పేద, మధ్య తరగతి ప్రజలు పప్పు దినుసులు అందులోనూ కందిపప్పు ఎక్కువగా వినియోగిస్తారు. ఇప్పుడు అది కూడా పేదలకు అందే పరిస్థితి లేదు. దీంతో బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు కొనుగోలు చేయలేక.. ఇటు ప్రభుత్వం సరఫరా చేయక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని రైస్ కార్డుదారులు ప్రశ్నిస్తున్నారు. కూటమి నేతలు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని రైస్ కార్డుదారులకు కందిపప్పు సరఫరా చేయాలని కోరుతున్నారు. ఇప్పటికే నిత్యవసరాల ధరలు భగ్గుమంటున్నాయని, కందిపప్పు ధర మరింత ఎక్కువగా మార్కెట్‌లో ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రేషన్ సరుకుల్లో కందిపప్పును మళ్లీ సరఫరా చేయాలని వారు కోరుతున్నారు.

కేటాయింపుల్లేవు..

> రైస్ కార్డుదారులకు కందిపప్పుకు సంబంధించి ఎటువంటి కేటాయింపుల్లేవు. ఈ ఏడాది మార్చి నెల నుంచి సరఫరా కాలేదు.
> – బి.శాంతి, జిల్లా మేనేజర్, సివిల్ సప్లై శాఖ

కంది పప్పు మార్కెట్‌లో రూ.140



బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు ధర రూ.140 వరకు ఉంది. రేషన్ షాపుల్లో రాయితీపై కేజీ రూ.67లకు చొప్పున ఇచ్చేవారు. రేషన్ షాపుల్లో తక్కువ ధరకు లభించడంతో కార్డుదారులు కొనుగోలు చేసే వారు. అయితే ఈ ఏడాది మార్చి నెల నుంచి కంది పప్పు సరఫరా కూటమి ప్రభుత్వం నిలిపి వేసింది. దీంతో రైస్ కార్డు లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు.

పోలీసుల తీరు అభ్యంతరకరం



- అధికారం శాశ్వతం కాదు..
- మాజీ మహిళామంత్రి రజని పట్ల ఇలానే వ్యవహరిస్తారా..!
- రెడ్ బుక్ రాజ్యాంగంలో పోలీసులు నిబంధనలు అతిక్రమిస్తున్నారు..
- భవిష్యత్‌లో చట్టం ముందు దోషులుగా నిలబడక తప్పదు
- మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ఎప్పుడూ కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉండిపోదనే వాస్తవాన్ని గుర్తుంచుకోవాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, మాజీ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మాజీ మహిళా మంత్రి విడదల రజని పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత ఆక్షేపనీయంగా ఉందని తీవ్రంగా ఖండించారు. పట్టణంలోని తన స్వగృహంలో స్థానిక విలేకరులతో ఆయన ఆదివారం మాట్లాడారు. ఓ మహిళ, మాజీ మంత్రి అయిన విడదల రజని పట్ల పోలీసులు అత్యంత అభ్యంతరకరంగా వ్యవహరించారని దుయ్యబట్టారు. రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతున్న కూటమి ప్రభుత్వ పాలనలో కొందరు పోలీసులు తీరు చాలా దారుణంగా ఉందని మండిపడ్డారు. పోలీసులు తమ నిబంధనలను అతిక్రమిస్తున్నారని హైకోర్టు కూడా ఆగ్రహించిన సంఘటనలు రాష్ట్రంలో నేటి పరిస్థితికి అద్దం పడుతుందన్నారు. ఎన్టీ రామారావు వంటి వ్యక్తే అధికారాన్ని కోల్పోయారని గుర్తు చేశారు. పోటీ చేసిన రెండు స్థానాల్లో ఒకప్పుడు ఓడిపోయిన పవన్‌కల్యాణ్ నేడు ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారని పేర్కొన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని గుర్తించాలని సూచించారు. భవిష్యత్‌లో కూడా కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉంటుందనే భ్రమలో కొందరు పోలీసులు నిబంధనలను అతిక్రమిస్తున్నారని మండిపడ్డారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా.. ఉప ముఖ్యమంత్రిగా, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా తాను పని చేసిన కాలంలో ఏనాడూ నిబంధనలకు విరుద్ధంగా వెళ్లమని పోలీసులకు చెప్పలేదని గుర్తు చేశారు. నేటి రెడ్ బుక్ రాజ్యాంగంలో నిబంధనలు అతిక్రమిస్తున్న అధికారులు, పోలీసులు భవిష్యత్‌లో చట్టం ముందు దోషులుగా నిలబడాల్సి వస్తుందని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలన్నీ ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని చెప్పారు. సమయం వచ్చినప్పుడు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

కళలను ప్రోత్సహించాలి

- సినీ నటీమణులు కవిత, జయలలిత



ఆహ్వాన నాటిక పోటీల కార్యక్రమంలో మాట్లాడుతున్న సినీ నటి కవిత

చీపురుపల్లి రూరల్(గరివిడి): నాటికలు కళలకు జీవమని, కళలను మరింతగా ప్రోత్సహించాలని సినీ నటి కవిత అన్నారు. గరివిడిలోని శ్రీరాం హైస్కూల్ ఆవరణలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉభయ రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీల ముగింపు కార్యక్రమంలో ఆమె ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళల మీద అభిమానం ఉన్న వాళ్లు మంచి ఆలోచనతో ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించటాన్ని హర్షించాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉంటానన్నారు. జయలలిత మాట్లాడుతూ ఉభయ రాష్ట్రాల స్థాయిలో జరుగుతున్న ఈ ఆహ్వాన నాటిక పోటీల్లో రెండు రోజులుగా భాగస్వామ్యమైనందుకు ఎంతో సంతోషిస్తున్నానన్నారు. గరివిడి ప్రాంతంలో ఇలాంటి నాటిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణ మంచి పరిణామమని కొనియాడారు. గరివిడి కల్చరల్ అసోషియేషన్ ప్రతినిధులు వాకాడ గోపి, రవిరాజ్, బమ్మిడి కార్తీక్, కంబాల శివ, వాకాడ శ్రీనువాసరావు, ఉప్పు శ్రీను తదితరుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఆహ్వాన నాటిక పోటీల కార్యక్రమంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, లోక్‌సత్తా పార్టీ నాయకులు భీశెట్టి బాబ్జీ, కె.త్రిమూర్తులరాజుతో పాటుగా అతిథులుగా రచయిత్రీ జాలాది విజయ, బలివాడ రమేష్, సినీ ఆర్టిస్టులు రవితేజ, అరుణ తదితరులు పాల్గొన్నారు.



నాటిక పోటీలను తిలకించేందుకు విచ్చేసిన ప్రేక్షకులు

ఆకలితో అలమటిస్తున్నా... కనికరించరా...!

నా గోడు పట్టదా..



నా పేరు బెల్లాన రాములమ్మ. మాది పూసపాటిరేగ గ్రామం. నిరుపేద కుటుంబానికి చెందిన మాకు ఎటువంటి ఆదరణ లేదు. నా భర్త బెల్లాన బుల్లి మరణించి ఏడాది దాటింది. నాకు వితంతవు పింఛన్, వృద్ధాప్య పింఛన్‌కు అర్హత వుంది. కానీ ఒక్క పింఛన్ కూడా మంజూరు కాలేదు. కనిపించిన అధికారులు, ప్రజాప్రతినిధులను ఏడాదిగా వేడుకుంటున్నా.. ఫలితం దక్కలేదు. దిక్కులేని కుటుంబాలకు దేవుడే దిక్కు అనుకుంటే ఆ ఆశ కూడా సన్నగిల్లింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అర్హత వున్న పింఛన్ దక్కలేదు.
– బెల్లాన రాములమ్మ, రాజా వీధి, పూసపాటిరేగ

నా మొర ఆలకించడం లేదు..



నా పేరు పిల్ల బుచ్చమ్మ. మాది పూసపాటిరేగ గ్రామంలోని భూడి వీధి. నా భర్త పిల్ల బంగారప్పడు గత ఏడాది జూన్ నెలలో మృతి చెందాడు. అప్పటి నుంచి కనిపించిన ప్రతి ఒక్క అధికారిని, నాయకులని పింఛన్ మంజూరు చేయాలని వేడుకుంటున్నాను. నా మొర ఆలకించడం లేదు. వృద్ధాప్య పింఛన్, వితంతువు పింఛన్‌కు అర్హత వుంది. కనీసం ఒక్క పింఛన్ కూడా మంజూరు కాలేదు. పింఛన్ కోసం తిరిగి తిరిగి శక్తి సన్నగిల్లింది. ఎలా బతకాలో తెలియడం లేదు.
– పిల్ల బుచ్చమ్మ, భూడి వీధి, పూసపాటిరేగ

- అర్హత ఉన్నా సామాజిక పింఛన్ అందని వైనం
- గొల్లుమంటున్న వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు
- ఏడాదిగా తిరుగుతున్నా పట్టించుకోని అధికారులు
- దరఖాస్తు చేసుకునేందుకు తెరుచుకోని వెబ్‌సైట్

పూసపాటిరేగ:

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా.. కొత్త పింఛన్లు మంజూరు కావడం లేదు. అర్హత ఉన్నా దరఖాస్తు చేసుకోవడానికి కనీసం వెబ్‌సైట్ తెరవలేదు. అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు నెలలుగా పింఛన్లు మంజూరు కాక ఆశతో ఆకలితో ఎదురు చూస్తున్నారు. భర్త చనిపోతే అదే నెలలో స్పౌజ్ కోటాలో అనుమతిచ్చి, ఏడాది కాలంగా భర్త చనిపోయి ఎటువంటి ఆదరణకు నోచుకోని మహిళలు పింఛన్‌కు నోచుకోకపోవడం తీవ్ర అన్యాయమని వితంతువులు వాపోతున్నారు. వందల సంఖ్యలో వితంతువులకు పింఛన్ అందక కనీసం మందుల ఖర్చుకు కూడా డబ్బుల్లేక అల్లాడుతున్నారు.





గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హత వున్న ప్రతి ఒక్కరికి వలంటీర్లు దరఖాస్తు చేసిందే తడువుగా పింఛన్ మంజూర య్యేది. ఇప్పుడు పరిస్థితి చూస్తే సంక్షేమ పథకాలు దేముడెరుగు కనీసం సామాజిక పింఛన్లు అయినా మంజూరు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో సుమారు 3200 మంది అర్హులైన పింఛన్‌దారులు వున్నారు. పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం, నెల్లిమర్ల మండలాల్లో ఇప్పటికే మండల పరిషత్ కార్యాలయాలు చుట్టూ వందలాది మంది అర్హులైన వారు కార్యాలయాల చుట్టూ ప్రదక్షణ చేస్తున్నారు. పూసపాటిరేగ గ్రామంలో భర్త చనిపోయి ఏడాది దాటుతున్నా పిల్ల బుచ్చమ్మ, బెల్లాన రాములమ్మ, జలమాదుల సరస్వతి అనే మహిళలకు పింఛన్ మంజూరు కాలేదు. దీంతో వీరు బతుకు జీవనంతో పడరాని పాట్లు పడుతున్నారు. అలాగే కుమిలి గ్రామంలో కోండ్ర లక్ష్మి, ఉప్పాడ అసిరమ్మ, బూర్లె అప్పయ్యమ్మ, పొట్నూరు రమణమ్మతో పాటు పలువురు ఇలానే పింఛన్ మంజూరు కాక ఆవేదన చెందుతున్నారు. ఇలా అర్హత వున్న ఎంతో మంది పింఛన్‌కు నోచుకోక ఇబ్బందులు పడుతున్నారు. పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవడానికి సచివాలయానికి వెళ్లినా వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదని వెనక్కి పంపిస్తున్నారు. గతంలో పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవడానికి నిరంతరాయంగా వెబ్‌సైట్ ఓపెన్ అయి వుండేది. నేటి పరిస్థితి చూస్తే భిన్నంగా వుంది. ఓ వైపు కొత్త పింఛన్‌లు మంజూరు చేయకుండానే మరోవైపు వున్న పింఛన్‌లు ఊడ దీయడానికి గ్రామాలలో సర్వేలు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అర్హులకు పింఛన్‌లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

నేడు ఉత్తరాంధ్ర సాధన సమితి సదస్సు

బొబ్బిలి: పట్టణంలోని ఎన్జీవో హోంలో సోమవారం ఉదయం 10 గంటలకు ఉత్తరాంధ్ర సాధన సమితి ఆధ్వర్యంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, రైతులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులతో సదస్సు నిర్వహిస్తున్నట్టు ఆ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు తెలిపారు. ఆదివారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర సాధన సమితి వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ నిర్ణయం సరికాదు

- ఎస్‌జీటీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రరావు



గజపతినగరం : రాష్ట్రంలో మోడల్ ప్రైమరీ స్కూళ్ల ప్రధానోపాధ్యాయులుగా స్కూల్ అసిస్టెంట్ల నియామకం సరి కాదని, ఈ పద్ధతిని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సెకండరీ గ్రేడ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనకల చంద్రరావు అన్నారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో ఆదివారం మాట్లాడారు. జీవో నంబరు 117 ద్వారా అనేక మంది ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పదోన్నతులు కల్పించిందని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రమోషన్లు పొందిన వారిని వెనక్కి తీసుకువచ్చి మోడల్ ప్రైమరీ స్కూళ్ల హెడ్ మాస్టర్లుగా నియమించడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. ఇప్పటికే కనీసం ప్రమోషన్లు రాక ఎస్‌జీటీలు ఎంతో వేదన చెందుతున్నారని, ఈ వేదనను ప్రభుత్వం మరింత పెద్దది చేసిందన్నారు. అసలు డీఎస్సీలో బీఎడ్ అనేది ప్రైమరీ ఉపాధ్యాయుడికి అర్హత కాదన్నప్పుడు స్కూల్ అసిస్టెంట్ ప్రైమరీ పాఠశాలలో పని చేయడానికి అర్హత ఎలా ఉంటుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం తన పద్ధతిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు.

పంట పండింది..!



రబీ వరి పంట బాగా పండింది. వంగర మండలంలో కొప్పర, కొండచాకరాపల్లి, ఇరువాడ, చంద్రంపేట, చౌదరివలస, మరువాడ, కింజంగి, కోనంగిపాడు తదితర గ్రామాల్లో రైతులు రబీలో వరి సాగు చేస్తున్నారు. 1010 రకం తేలిక పంట కావడంతో కోత దశకు చేరింది. పంట పుష్కలంగా పండడంతో లాభాలు తెచ్చి పెడుతుందని రైతులు ఆశ పడుతున్నారు.
– వంగర

క్లుప్తంగా

అనధికార మద్యం దుకాణాలపై దాడి

● 10 మద్యం బాటిల్స్‌తో వ్యక్తి అరెస్టు


అల్లాడపాలెంలో చేసిన దాడుల్లో దొరికిన మద్యం బాటిల్స్

పూసపాటిరేగ: మండలంలోని చోడమ్మ అగ్రహారంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న బెల్టుషాపులపై భోగాపురం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్ ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ దాడుల్లో చోడమ్మ అగ్రహారానికి చెందిన వ్యక్తి పట్టుబడడంతో 10 మద్యం బాటిల్స్‌తో అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరూ అనధికారికంగా మద్యం దుకాణాలు (బెల్ట్ షాపులు) నిర్వహించరాదని, ప్రోత్సహించరాదని స్పష్టం చేశారు. ఈ దాడుల్లో ఎస్సై చంద్రమోహన్ హెచ్‌సీ రామారావు, కానిస్టేబుల్ మహేష్‌లు పాల్గొన్నారు.

ఎండవేడికి కాలిపోయిన ట్రాక్టర్ ఇంజిన్


ఎండవేడికి తగలబడుతున్న ట్రాక్టర్ ఇంజిన్

శృంగవరపుకోట: మండలంలోని పోతనాపల్లి పంచాయతీ పరిధి ఎరుకులపేట హోలీ స్పిరిట్ పాఠశాల సమీపంలో గల ఇటుకల బట్టీ వద్ద ఉంచిన ట్రాక్టర్ ఇంజిన్‌లో ఎండవేడికి ఒక్కసారిగా మంటలు వచ్చి ఆదివారం కాలిపోయింది. దీనిపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పొట్నూరు శివ తన ట్రాక్టర్‌ను ఇటుకల బట్టీ వద్ద ఉదయం 11 గంటల ప్రాంతంలో ఉంచి పక్కనే సేదతీరాడు. అంతలోనే ఇంజిన్ నుంచి ఒక్కసారిగా పొగలు వచ్చి వెంటనే పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. ఆ మంటలను అదుపు చేయడానికి స్థానికులు సాహసించినా నిలువరించ లేకపోయారు. దీంతో ఎస్.కోట అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అప్పటికే ట్రాక్టర్ పూర్తిగా కాలిపోయిందని శివ తెలిపాడు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి


వైద్యం కోసం 108లో తరలిస్తున్న దృశ్యం

కొత్తవలస: కొత్తవలస–దేవరాపల్లి రోడ్డులో దేవాడ జంక్షన్ సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డుప్రమాదంలో లక్కవరపుకోట మండలం కోనమసివాని పాలెం గ్రామానికి చెందిన గాడి తాత (63) మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాడి తాత దేవాడ జంక్షన్ నుంచి నడుచుకుంటూ వస్తుండగా తుమ్మికాపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై వేగంగా వచ్చి వెనుకనుంచి వచ్చి తాతాను ఢీకొట్టారు. దీంతో తీవ్ర గాయాలపాలైన తాతను స్థానికుల సహాయంతో 108 వాహనంలో విశాఖపట్నం తరలించే క్రమంలో పెందుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో చూపించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా మృతుడుకి భార్య సన్యాసమ్మతో పాటూ ఒక కూతురు ఉంది. ఫిర్యాదు మేరకు కొత్తవలస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. .

లారీ ఢీకొని యువకుడు..


జానకీరాం మృతదేహం

బొండపల్లి: మండలంలోని బోడసింగిపేట గ్రామ పెట్రోల్ బంకు సమీపంలో జాతీయ రహదారి26పై లారీ ఢీకొనగా ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న యువకుడు మృతి చెందాడు. ఆదివారం ఉదయం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి ఎస్సై యు.మహేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాలూరు నియోజకవర్గంలోని మక్కువ మండలం, మక్కువ గ్రామంలోని శ్రీదేవి కాలనీకి చెందిన యువకుడు తుమరాడ జానకీరాం (22) ద్విచక్రవాహనంపై విశాఖపట్నం నుంచి స్వగ్రామం ఆదివారం వస్తుండగా విజయనగరం నుంచి గజపతినగరం వైపు వస్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో ఈ ప్రమాదంలో జానకీరాం అక్కడిక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం విజయనగరం లోని సర్వజన కేంద్రాస్పత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹240

నీలి కిరణాలతో అంధత్వం


నేత్ర తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

● సెల్‌ఫోన్, కంప్యూటర్ అతిగా వాడకంతో ఇబ్బందులు
● చిన్న వయసులోనే దృష్టిలోపాలు
● పెరుగుతున్న దూరదృష్టి సమస్యలు
● కంటివైద్యుల వద్దకు క్యూకడుతున్న బాధితులు

రాజాం సిటీ: ప్రస్తుత జీవన ప్రమాణాల్లో భాగంగా సెల్‌ఫోన్ నిత్యావసర వస్తువుగా మారిపోయింది. చిన్నా పెద్ద తేడా లేకుండా ఎవరి చేతిలో చూసినా ఫోన్ కనిపిస్తుంది. ఇంట్లో, బయట, పదిమంది కలిసినచోట, భోజనం చేసిన సమయంలో సెల్‌ఫోన్ వినియోగంలో నిమగ్నమవుతున్నారు. గంటల తరబడి మొబైల్ చూడడం, కంప్యూటర్ స్క్రీన్‌కు అతుక్కుపోవడం వల్ల కంటి సమస్యలు ఎక్కువగా వస్తాయని డాక్టర్లు చెబుతున్నారు.

దృష్టి లోపానికి కారణాలు..

- డిజిటల్ పరికరాలను విస్తృతంగా వినియోగించడం
- రెండు గంటలకన్నా ఎక్కువగా కంప్యూటర్, సెల్‌ఫోన్ అదేపనిగా చూడడం
- కంప్యూటర్‌లో అక్షరాలను తదేకంగా చూడడంవల్ల కళ్లు ఒత్తిడికి గురవుతాయి
- స్క్రీన్ కాంట్రాస్ట్ ఎక్కువగా ఉండడం
- సాధారణంగా నిమిషానికి 18 నుంచి 20 సార్లు రెప్పవాల్చాలి. కానీ కంప్యూటర్ చూసేవారికి ఇది 3 నుంచి 6 సార్లకు పడిపోతుంది. దీనివల్ల కళ్లలోని ఉపరితలం పొడిబారుతుంది.

చికిత్స, నివారణ..

కళ్లకు తేమను కలిగించేలా కృత్రిమంగా కన్నీళ్ల తరచుగా వాడడం
✔ కళ్ల రెప్పలను తరచుగా మూయడం
✔ దృష్టిలోపాలకు వాడే అద్దాలు బ్లూఫిల్టర్ ఉండేలా చూడడం
✔ స్క్రీన్ టైం తగ్గించుకోవడం
✔ 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువులను 20 సెకెన్లపాటు వీక్షించడం.
✔ కంప్యూటర్, సెల్‌ఫోన్ స్క్రీన్ బ్రైట్‌నెస్, కాంట్రాస్ట్‌ను సర్దుబాటు చేసుకోవడం
✔ కంప్యూటర్, సెల్‌ఫోన్‌లో అక్షరాలను పెద్దవిగా చేసుకోవడం.
✔ సంవత్సరానికి ఒకటి, రెండు సార్లు డ్రై ఐ గురించి కంటి వైద్యులను సంప్రదించడం

ముఖ్యంగా మొబైల్స్ నుంచి వచ్చే నీలి కాంతి కిరణాలు కంటిపై ప్రభావం చూపి దెబ్బతినే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. ఒకప్పుడు పగలంతా పనులు చేసుకుని సాయంత్రం ఇంటికి వచ్చిన తరువాత చీకటి పడగానే తినేసి నిద్రకు ఉపక్రమించేవారు. ఇప్పుడు ప్రజల జీవన విధానంలో మార్పులు వచ్చాయి. రాత్రి 11 నుంచి 12 గంటల వరకు టీవీలు, మొబైల్స్, కంప్యూటర్లు, లాప్‌టాప్‌లకు అతుక్కుపోతున్నారు. 60 శాతం ప్రజలు రోజులో 5 నుంచి 6గంటల పాటు సెల్‌ఫోన్ చూస్తున్నారు. యువతీ యువకులు రోజుకు కనీసం 10 గంటలకు పైగా స్క్రీన్ చూస్తున్నారు. ఇలా సెల్‌ఫోన్‌కు బానిస కావడం వల్ల చేతి వేళ్లు సెల్‌ఫోన్‌పైకి వెళ్తుంటాయి. చిన్నారులు సైతం సెల్‌ఫోన్‌కు అలవాటుపడ్డారు. సెల్‌ఫోన్, టీవీల నుంచి వచ్చే కృత్రిమ కాంతిలో ఉండే బ్లూలైట్ కంటిపై ఎక్కువగా పడుతోంది. దీనివల్ల కంటికి కొత్త చిక్కులు వచ్చిపడుతున్నాయి.

బ్లూ లైట్‌తో కళ్లకు ప్రమాదం..

మొబైల్ ఫోన్‌లో ఉండే నీలికాంతి కళ్లపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మొబైల్ కాంతి ఎక్కువగా పెట్టుకుని చూడడం వల్ల వాటిలోని రేడియేషన్, అల్ట్రావైలెట్ రేస్ వల్ల కళ్లలో నీళ్లు ఇంకిపోయి పొడిబారుతాయి. విద్యార్థులు, యువకులు మొబైల్, కంప్యూటర్, లాప్‌టాప్‌లను దగ్గర నుంచి చూడడం వల్ల క్రమంగా వారికి మయోపియా (దూరంగా ఉన్నవి కనిపించవు) సమస్య వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా దృష్టిలోపం ఉండేవారిలో ఏడాది నుంచి రెండేళ్లకు వారి కంటి అద్దాల నంబర్ మారుతుంది. కానీ ఎక్కువసేపు ఆన్‌లైన్ క్లాస్‌ల కారణంగా తక్కువ సమయంలోనే కంటి అద్దాల నంబర్ మారుతోంది. దీనికితోడు వర్క్‌ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ క్లాసుల పేరుతో ఉదయం నుంచి సాయంత్రం వరకు తదేకంగా మానిటర్లను చూడడం వల్ల కంటి కండరాలపై ఒత్తిడి పెరిగి సాయంత్రం వేళ తలనొప్పి వస్తుంది.

కంటి సమస్యలు రాకుండా జాగ్రత్తలు..

- ప్రతి అరగంటకు ఒకసారి మొబైల్, కంప్యూటర్, లాప్‌టాప్ నుంచి రెండు మూడు నిమిషాలైనా దృష్టిని మరల్చాలి.
- కంటికి స్క్రీన్‌ను 25 నుంచి 40 అంగుళాల దూరం ఉంచాలి.
- యాంటీగ్లేర్, యాంటీ రిఫ్లెక్టివ్ అద్దాలను వాడితే కంటికి రక్షణగా ఉంటుంది. ఇవి అధిక కాంతిని కళ్లపై పడకుండా అడ్డుకుంటాయి.
- కళ్ల మంటలు, నీరు కారడం వంటి సమస్యలుంటే కాసేపు మానిటర్లు చూడడం ఆపేయాలి.
- తరచూ చల్లని నీటితో కళ్లను కడుక్కోవాలి. రాత్రి నిద్రించే సమయంలో కళ్లపై కాసేపు తడి వస్త్రాన్ని కప్పి ఉంచాలి.
- కంటికి కసరత్తులు సైతం అవసరం. ఇందు కోసం కళ్లను కుడిఎడమలకు నిమిషంపాటు తిప్పాలి. రెండు అరచేతులు రుద్దకుని వేడెక్కిన తరువాత కళ్లపై కాసేపు ఉంచి కసరత్తు చేయాలి.

ఎక్కువగా సెల్‌ఫోన్ చూడరాదు..



కంప్యూటర్, సెల్‌ఫోన్‌ను ఎక్కువగా చూడడం వల్ల అందులోని నీలికాంతి కళ్లపై పడి కళ్లు దెబ్బతింటాయి. కంటి జబ్బులతో వస్తున్న వారిలో కళ్లు పొడిబారడం, ఎర్రగా మారడం, కళ్లు మంటలు, కంట్లో దురద వంటి సమస్యలు వస్తాయి. మొబైల్స్ అతిగా చూడడంవల్లే ఈ సమస్య అధికమవుతోంది. ప్రస్తుతం వేసవి సెలవుల కారణంగా విద్యార్థులకు సెల్‌ఫోన్ దూరంగా ఉంచడం ఎంతైనా మంచిది.

యస్.లక్ష్మిశ్రీ, నేత్రవైద్యనిపుణురాలు, సీహెచ్‌సీ, రాజాం

చిన్నతనం నుంచే సమస్యలు..



కంటి సమస్యలు చిన్నవయసులోనే ఉత్పన్నమవుతున్నాయి. పాఠశాల స్థాయిలో విద్యార్థులు తక్కువ కాంతిలో చదడం, ఎక్కువగా సెల్‌ఫోన్ వాడడం వల్ల ఈ సమస్య వస్తుంది. చిన్నారులకు పాఠశాలల్లో నిర్వహించిన తనిఖీల్లో ఎక్కువ మంది ఇటువంటి సమస్యలతో బాధపడుతున్న వారే. అలాగే 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ కళ్ల తనిఖీ తప్పకుండా చేయించుకోవాలి.

ఎస్.వసంతరావు, ఆప్థాలమిక్ అధికారి, రాజాం

దేవర మహోత్సవానికి సర్వం సిద్ధం

● సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి ఊరేగింపు
● మంగళవారం నుంచి చదురుగుడిలో అమ్మవారి దర్శనం


పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, సిరుల తల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు దేవర మహోత్సవ ఘట్టం మరికొద్ది గంటల్లో ప్రారంభం కానుంది. రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడి నుంచి చదురు గుడికి అమ్మవారిని తీసుకువచ్చే అద్భుతమైన అపురూప ఘట్టానికి అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి వనంగుడిలో స్తపన మందిరంలో అమ్మ ఉత్సవ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తారు. వేదపండితుల వేదమంత్రోచ్చారణలతో పూజారి బంటుపల్లి వెంకటరావు, భక్తుల చేతుల మీదుగా అమ్మవారిని అప్పటికే ఆలయం బయట పుష్పాలతో సిద్ధం చేసిన ఉత్సవరథంపై ఆశీనులను చేస్తారు. జయజయ ధ్వానాల మధ్య బాజాభజంత్రీలు, విచిత్ర వేషధారణలు, కోలాటం బృందాలు, డముకు వాయిద్యాలతో రైల్వేస్టేషన్ నుంచి గాడీకానా, సీఎంఆర్ జంక్షన్, వైఎస్సార్ సర్కిల్, ఎన్‌సీఎస్ రోడ్, కన్యకపరమేశ్వరి ఆలయం, గంటస్తంభం, శివాలయం వీధి మీదుగా హుకుంపేటలో ఉన్న పూజారి ఇంటికి తీసుకువెళ్తారు. అక్కడ రాత్రి 10 గంటల సమయంలో ఘటాలతో అమ్మవారికి నివేదన చేస్తారు. అమ్మవారికి మనవి చెప్పిన అనంతరం కోటలో కొలువైన కోటశక్తికి పూజలు చేస్తారు. వేకువజామున 3 గంటల ప్రాంతంలో అమ్మవారు సాక్షాత్కరించిన పెద్దచెరువు పశ్చిమభాగానికి ఘటాలతో చేరుకుని మనవి చెప్పి పసుపు, కుంకుమలతో పూజలు చేసి, ఘటాల్లో పసుపు, కుంకుమలతో పాటు పూజ చేసిన అక్షింతలను తీసుకుని మంగళవారం వేకువజామున 5 గంటలకు చదురుగుడికి చేరుకుంటారు.

ఇన్‌చార్జ్ ఈఓ ఆధ్వర్యంలో ఏర్పాట్లు

అనంతరం ఆలయంలో అమ్మవారికి డప్పువాయిద్యాలు, సన్నాయి మేళంతో పూజలు చేసి, ధూపదీప నైవేద్యాలు సమర్పించిన తరువాత 6 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పిస్తారు. ఈ అపురూప ఘట్టాలను తనివితీరా చూసేందుకు భక్తులు తండోపతండాలుగా తరలివస్తారు. ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ నేతృత్వంలో అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పైడితల్లి అమ్మవారి సిరిమాను జాతర చివరి ఘట్టమైన ఉయ్యాల కంబాల మహోత్సవం తర్వాత రోజున బుధవారం మళ్లీ అమ్మవారు చదురుగుడి నుంచి వనంగుడికి చేరుకుంటారు. భక్తులందరూ అమ్మవారిని దర్శించి, తరించాలని ఆలయ ఈఓ ప్రసాద్ కోరారు.

హృదయాలను తాకిన నాటికలు


కొత్త పరిమళం నాటికలో ఓ సన్నివేశం

చీపురుపల్లి రూరల్(గరివిడి): ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీల్లో భాగంగా గరివిడిలోని శ్రీరామ్ హైస్కూల్ ఆవరణంలో గరివిడి కల్చరల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో జరిగిన నాటికల పోటీలు ఆదివారం ముగిశాయి. ముగింపు రోజున ప్రదర్శించిన కొత్త పరిమళం, చీకటిపువ్వు, దేవరాగం నాటికలు చక్కటి కథా సారాంశాన్ని అందించి ప్రేక్షకుల హృదయాలను ఆకట్టుకున్నాయి. బొరివంకకు చెందిన శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవాసంఘం ఆధ్వర్యంలో ప్రదర్శించిన కొత్త పరిమళం నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. జాతి,మత,కుల,ప్రాంతాల పేరుతో విధ్వంసాలు రేగుతున్న భూమండలంలో ప్రేమ, అభిమానం, అనురాగం అనువణువునా నింపుకుని మనిషిని మనిషి ప్రేమిస్తే ఈ భూమండలం శాంతివనంగా మారుతుందన్న కథా సందేశంతో కొత్త పరిమళం నాటిక ముగుస్తుంది. అదే విధంగా కరీంనగర్‌కు చెందిన చైతన్య కళాభారతి ఆధ్వర్యంలో ప్రదర్శించిన చీకటిపువ్వు నాటిక సమాజంలో ప్రతి ఒక్కరి జీవితంలో ఎదురైన విలువైన సారాంశాన్ని అందించింది. పరిస్థితులకు ఏ మనిషి అతీతం కాదని, అవసరం ఏర్పడో, అవకాశం లేకనో ప్రతి ఒక్కరూ జీవితంలో తప్పులు చేయడం సహజం. చేసిన తప్పులు తెలుసుకుని పశ్చాత్తాపం చెందిన వారిని దూరం పెట్టొద్దని, క్షమించడంలోనే నిజమైన ప్రేమ ఉందని, ప్రాణం పోయిన తరువాత బాధపడే కంటే ఉన్నప్పుడే బాధ్యతగా వ్యవహరించాలంటూ తెలియజెప్పే కథాంశంతో చీకటిపువ్వు నాటిక ముగుస్తుంది. అదేవిధంగా విశాఖపట్నానికి చెందిన సౌజన్య కళాస్రవంతి ఆధ్వర్యంలో ప్రదర్శించిన దేవరాగం నాటిక బలమైన బంధాన్ని తెలియజెబుతుంది. రక్త సంబంధాలు, పేగు బంధాలు, అనుబంధాల కంటే మనిషి సహజ లక్షణాలు అనేవి వాటన్నింటినీ మించిన బంధం పేగుబంధం. ఈ బంధం విచ్ఛిన్నమైతే తల్లిదండ్రులకు వృద్ధాప్యం శాపమవుతుందని, ఈ బంధం బలంగా ఉంటే వృద్ధాప్యమే ఆ తల్లిదండ్రులకు మధురమైన మలి దశలోని బాల్యం అవుతుందని తెలియజెప్పే కథా సారాంశంతో దేవరాగం నాటిక సమాప్తమైంది.


చీకటిపువ్వులో సన్నివేశం

ఇంటర్‌లో కొత్తపాఠాలు

● సీబీఎస్‌ఈ అమలుకు సిద్ధం
● అధ్యాపకులకు శిక్షణ పూర్తి
● విద్యార్థులకు అదనపు ప్రయోజనం


సీబీఎస్‌ఈ సిలబస్‌పై ఆన్‌లైన్ శిక్షణ పొందుతున్న అధ్యాపకులు

విజయనగరం అర్బన్: ఇంటర్మీడియట్ విద్యాబోధనలో నూతన సంస్కరణలను ప్రభుత్వం ఈ ఏడాది చేపడుతోంది. జూనియర్ కళాశాలల్లో సీబీఎస్‌ఈ అమలుకు ఇప్పటికే అడుగులు పడ్డాయి. కొత్తగా ఎంబైపీసీ కోర్సును అమలుచేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు అధ్యాపకులకు శిక్షణ సైతం ఇచ్చారు. మిగిలిన గ్రూపుల్లో ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ ప్రకారం పరీక్షల విధానం, మార్కుల కేటాయింపునకు శ్రీకారం చుట్టారు. జిల్లాలోని 18 ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫాకల్టీ అధ్యాపకులకు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మూడు స్పెల్‌లలో ఇటీవల శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేశారు.

కోర్సుల నూతన విధానం

ఒకే సబ్జెక్టుగా గణితం–ఎ, బి, వృక్ష శాస్త్రం, జంతు శాస్త్రం కలిపి బయాలజీగా రూపొందించారు. ఇందుకు తగ్గట్లు మార్కుల విభజన చేశారు. పార్ట్–1 సబ్జెక్టు కింద ఆంగ్లమే ఉంటుంది. పార్ట్–2 కింద జాతీయ భాషలతోపాటు మరికొన్ని సబ్జెక్టులు ఉంటాయి. విద్యార్థి అభీష్టం మేరకు దేనినైనా ఎంపిక చేసుకునే అవకాశం ఉంది. పార్ట్–3లో ఎంపీసీ, బైపీసీ సీఈసీ, హెచ్‌ఈసీ, ఎంఈసీ గ్రూపులుంటాయి. సెకెండ్ లాంగ్వేజీకి సంబంధించి తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూకు బదులు గణితం, ఎంపీసీలో చేరిన వారు తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూకు బదులుగా బయాలజీని తీసుకోవచ్చు.

విద్యార్థులకు అదనపు ప్రయోజనం

నూతన విధానంలో భాగంగా ఎంపీసీ తీసుకున్న విద్యార్థి అదనంగా బయాలజీ, బైపీసీ తీసుకున్న వారు గణితం తీసుకునే అవకాశం కల్పించారు. పార్ట్–1, 2, 3 సబ్జెక్టుల్లో వచ్చిన మార్కులనే పరిగణిస్తారు. అదనంగా తీసుకున్న సబ్జెక్టుల మార్కులను ఇందులో కలపరు. కనీసం 35 మార్కులొస్తేనే ఉత్తీర్ణత సాధించినట్లు. ఉత్తీర్ణులు కాకపోయినా ధ్రువీకరణ పత్రం ఇస్తారు. అదనపు సబ్జెక్టులో ఉత్తీర్ణులైతే భవిష్యత్తులో మెడికల్, ఇంజినీరింగ్, బయోటెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్ తదితర కోర్సులు అభ్యసించేందుకు అవకాశం ఉంటుంది. సదరు విద్యార్థి నీట్, ఏపీఈఏపీ సెట్‌కు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. కొత్త సిలబస్ ఆధారంగా అన్ని సబ్జెక్టులకు సంబంధించి పరీక్షలకు ప్రశ్నపత్రాలు మారుతాయి. ఒక్క మార్కు ప్రశ్నలను ప్రవేశపెట్టనున్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సిలబస్‌లో గానీ, పరీక్ష ప్రశ్నపత్రంలో గానీ ఎటువంటి మార్పు ఉండదు.

విద్యార్థులకు మంచి అవకాశం



ఇంటర్‌లో ఎంబైపీసీ కోర్సులు విద్యార్థులకు విభిన్న రంగాలలో చదువుకోవడానికి మంచి అవకాశం. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో పోటీపడే అవకాశాలు లభిస్తాయి. సీబీఎస్‌ఈ సిలబస్ పాఠ్యాంశాల మార్పులతో పాటు కొత్త కోర్సులు ఈ విద్యాసంవత్సరం నుంచి అమలులోకి వస్తున్నాయి. విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటే ఉన్నతవిద్యలో మరిన్ని అవకాశాలు సాధ్యం.

శివ్వాల తవిటినాయుడు, జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి (డీఐఈఓ)

సాలూరులో కలకలం

● పాకిస్థాన్‌కు అనుకూలంగా పోస్టుపెట్టిన యువకుడు
● సాలూరులో సంచరిస్తున్నట్లు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారిన వార్త
● తనిఖీలు చేపట్టిన పోలీసులు


తనిఖీలు చేస్తున్న టౌన్ సీఐ అప్పలనాయుడు, పోలీసులు

సాలూరు: దశాబ్దంన్నర కాలం తరువాత సాలూరు పట్టణంలో జరగనున్న శ్యామలాంబ అమ్మవారి పండగ జాతర ఏర్పాట్లలో అంతా నిమగ్నమై ఉండగా పట్టణంలో ఒక్కసారిగా కలకలం రేగింది. పాకిస్థాన్‌కు అనుకూలంగా సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ పెట్టిన అమలాపురానికి చెందిన యువకుడు అక్కడి నుంచి సాలూరు వచ్చాడన్న వార్త పలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీంతో అందరూ ఉలిక్కిపడ్డారు. భారత్, పాకిస్థాన్‌ల మధ్య యుద్ధ వాతావరణ పరిస్థితుల తరువాత జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో సాలూరులో ఈ వార్త చక్కర్లు కొట్టడంతో, ఇక్కడి వాతావరణం మరింత వేడెక్కింది. అయితే ఈ విషయం తెలుసుకున్న పోలీసులు పట్టణ సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో తనిఖీలు ముమ్మరం చేశారు. బస్సులు, కార్లు, ప్రైవేట్ వాహనాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తుల వివరాలు ఆరా తీయడంలో నిమగ్నమయ్యారు. పాకిస్థాన్‌కరు అనుకూలంగా సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసిన యువకుడు సాలూరు వచ్చాడన్న వార్త ఓ వైపు మరో వైపు పోలీసుల తనిఖీలతో పట్టణంలో వాతావరణం వేడెక్కింది. దీనిపై సీఐ అప్పలనాయుడిని వివరణ కోరగా, సదరు యువకుడు సాలూరు వచ్చాడన్న సమాచారంతో తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నామన్నారు. ఆ యువకుడిని అమలాపురం మండలం కామనగురువు పంచాయతీ పరిధిలోని మిక్సర్ కాలనికి చెందిన పి.రాజుగా పోలీసులు అనుమానిస్తున్నట్లు తెలుస్తోంది.

రామభద్రపురంలో గాలింపు

రామభద్రపురం: భారత్–పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో అందరూ దేశంపై అభిమానంతో యుద్ధంలో భారత్ నెగ్గాలని సామాజిక మాధ్యమాల్లో పోస్టులు, కార్యక్రమాలు చేపడుతున్నారు.ఈ క్రమంలో ఆంధ్రాకు చెందిన యువకుడు పాకిస్థాన్‌కు జై కొడుతూ రాజు రెబల్ అనే ఫేస్ బుక్ ఖాతాలో పాకిస్థాన్ జెండా పెట్టి జై పాకిస్థాన్ అని పెట్టిన పోస్టు హల్‌చల్ చేస్తోంది. ఆ యువకుడు రామభద్రపురం ఏరియాలో సంచరిస్తున్నట్లు సెల్‌సిగ్నల్ చూపించడంతో ఈ విషయమై రామభద్రపురం పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఇక్కడి ఎస్సై వి.ప్రసాదరావుతో పాటు పోలీసులు అప్రమత్తమై అనుమానితుడి కోసం గాలిస్తున్నారు.



పాకిస్థాన్‌కు జై కొట్టిన యువకుడు, ఫేస్ బుక్ ఖాతాలో పెట్టిన పోస్టు

భారత సైన్యానికి క్రీడాభివందనాలు


ఎస్‌కోటలో ర్యాలీలో పాల్గొన్న క్రీడాకారులు

శృంగవరపుకోట: భారత్ మాతా కీ జై అంటూ నినాదాలతో ఆదివారం బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం క్రీడాకారులు ర్యాలీ నిర్వహించారు. భారత దేశ ప్రజల ధన,మాన ప్రాణాలకు తమ ప్రాణాలు అడ్డుపెట్టి కాపాడుతున్న మన భారత ప్రభుత్వానికి, భారత సైన్యానికి మద్దతుగా క్రీడాకారులు ర్యాలీ నిర్వహించారు. శిక్షణ శిబిరం కోచ్, ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టరు పొట్నూరు శ్రీరాములు ఆధ్వర్యంలో కేంబ్రిడ్జి స్కూల్ నుంచి దేవీ బొమ్మ, వన్‌వే ట్రాఫిక్ పెద్దవీధి, కాపువీధి మీదుగా భారత్ మాతాకి జై అంటూ ర్యాలీలో నినాదాలు చేశారు.